గురుకుల పీడీ జాబితాలో అనర్హులు!

నోటిఫికేషన్‌కు విరుద్ధంగా ఇద్దరి ఎంపిక • పలువురు కోర్టుకెక్కడంతో తొలగించినట్టు ట్రిబ్ ప్రకటన

- అయినా పకడ్బందీగా చేపట్టామంటూ బుకాయింపు
- జాబితాలోకి అనర్హులు ఎలా వచ్చారని అభ్యర్థుల ప్రశ్న
- ఇతర పోస్టుల్లోనూ అవకతవకలు ఉన్నాయంటూ ఆరోపణలు

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ మెప్పుకోసం హడావుడిగా, అడ్డదిడ్డంగా గురుకులాల పోస్టుల భర్తీని చేపట్టి, అనర్హులను ఎంపిక చేసిన తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ట్రిబ్) ఇప్పుడు సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నది. ఒకవైపు జాబితాలో ఉన్న అనర్హులకు పోస్టింగ్‌లను నిలిపేసినట్టు చెప్తూనే మరోవైపు నోటిఫికేషన్ ప్రకారమే నియామకాలు చేపట్టామని దబాయిస్తున్నది. దీంతో ట్రిబ్ తీరుపై గురుకుల అభ్యర్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పకడ్బందీగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను చేపడితే అనర్హులు ఎంపిక జాబితాలోకి ఎలా వచ్చారని నిలదీస్తున్నారు. ఇంకా జాబితాలో అనర్హులు ఎంత మంది ఉన్నారో? అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు లైబ్రేరియన్ సైన్స్, పీజీటీ, టీజీటీ పోస్టుల్లోనూ అవకతవకలు జరిగాయని ఆరోపణలకు దిగుతున్నారు.

ఎంపిక జాబితాలో అనర్హుల గుర్తింపు

రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ గురుకులాల్లో ఖాళీలను ట్రిబ్ ఇటీవల భర్తీ చేసింది. వాటిలో స్కూల్ పీడీ (ఫిజికల్ డైరెక్టర్) పోస్టులకు ట్రిబ్ గత ఏప్రిల్ 24 నుంచి మే 24 వరకు దరఖాస్తులను స్వీకరించింది. నోటిఫికేషన్ ప్రకారం 2023 ఏప్రిల్ 5 నాటికి పీడీ పోస్టుల అర్హతకు సంబంధించిన అన్ని పరీక్షలు ఉత్తీర్ణులైన అభ్యర్థులే అర్హులుగా ప్రకటించింది. దానిప్రకారం గత మే నెల నాటికే అభ్యర్థులు ఆయా విద్యార్హతలను సాధించి ఉండాలి. కానీ ప్రస్తుతం ట్రిబ్ మాత్రం నోటిఫికేషన్‌కు విరుద్ధంగా గత నవంబర్‌లో ఉత్తీర్ణులైన ఇద్దరు అభ్యర్థులను పీడీ పోస్టులకు ఎంపిక చేసింది. 2302069885, 2302070434 హాల్‌టికెట్ నంబర్లు కలిగిన వారిని అనర్హులుగా గుర్తించారు. నోటిఫికేషన్ సమయానికి వారిద్దరూ బీపీఎడ్ ఉత్తీర్ణులు కాలేదు. ట్రిబ్ మాత్రం పోస్టింగ్ ఇచ్చింది. దీనిపై పలువురు అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తంచేస్తూ ఇటీవల కోర్టును ఆశ్రయించారు. దీంతో ఆ ఇద్దరికీ పోస్టింగ్‌లు ఇవ్వడంలేదని, జాబితాలో నుంచి తొలగించామని ట్రిబ్ కోర్టు ఎదుట ప్రకటించింది. దీంతో ట్రిబ్ వ్యవహారంపై గురుకుల అభ్యర్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇంకొందరు అనర్హులపై అనుమానాలు

పకడ్బందీగా సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేస్తే అనర్హులు ఎలా ఎంపిక జాబితాలోకి వచ్చారని ఇతర అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. ఇంకా ఎంత మంది అనర్హులు జాబితాలో ఉన్నారోనని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. క్యాటగిరీల వారీగా కటాఫ్ మార్కులను, జోన్ వారీగా ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తే ఇంకా అనేక అవకతవకలు బయటపడతాయని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ట్రిబ్ ఆయా జాబితాలను ఇప్పటికీ వెల్లడించడం లేదని విమర్శిస్తున్నారు. అంతేకాదు సొసైటీల వారీగానే కాకుండా, జోన్ల వారీగా చూసుకున్నా నాన్‌లోకల్ అభ్యర్థులకు ఒక్క పీడీ పోస్టు కూడా దక్కదని కానీ, ఏకంగా ముగ్గురు నాన్‌లోకల్ అభ్యర్థులకు ట్రిబ్ పోస్టింగ్‌లు ఇచ్చిందని కూడా అభ్యర్థులు ఆరోపిస్తూ కోర్టుకెక్కడం కొసమెరుపు.

ఇద్దరు పీడీ అభ్యర్థులకు అన్యాయం

ఒకవైపు రీలిక్విష్‌మెంట్ లేదన్న ట్రిబ్ మరోవైపు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను సజావుగా నిర్వహించని కారణంగా ఇద్దరు పీడీ అభ్యర్థులు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. 1:2 జాబితాను విడుదల చేసి తుది జాబితాను ప్రకటించింది. అందులో ఇద్దరు అనర్హులు ఉన్నారని గుర్తించి పక్కన పెట్టామని ట్రిబ్ స్వయంగా ప్రకటించింది. అయితే రీలిక్విష్‌మెంట్ ఉన్నట్టయితే 1:2 జాబితాలోని తదుపరి అభ్యర్థులకు ఆ పోస్టులు దక్కేవి. కానీ ట్రిబ్ మాత్రం రీలిక్విష్‌మెంట్ లేదని తేల్చిచెప్పింది. దీంతో ఆ రెండు పోస్టులు మళ్లీ బ్యాక్‌లాగ్‌లో పడుతుండగా, ఇద్దరు అభ్యర్థులు నష్టపోయారు.

నిబంధనల మేరకే నియామకాలు: ట్రిబ్

గురుకుల ఉపాధ్యాయుల నియామకాల్లో ప్రభుత్వ నిబంధనల మేరకే నియామకాలు చేపట్టామని ట్రిబ్ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్ష విధానంలో అవకతవకలకు తావులేకుండా పకడ్బందీగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించినట్టు తెలిపింది. 2018లో గత ప్రభుత్వం రిలింక్విష్‌మెంట్ పద్ధతిని తొలగించిందని పేర్కొన్నది. కోర్టు కేసులను పరిష్కరించి, ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ఫలితాలను ప్రకటించి చిత్తశుద్ధిని నిరూపించుకున్నామని అధికారులు స్పష్టం చేశారు. దివ్యాంగులకు అనువైన తేదీల్లోనే మెడికల్ వెరిఫికేషన్ జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఏ ఒక్క పోస్టు కూడా అనర్హులకు దక్కొద్దనే సంకల్పంతోనే పని చేస్తున్నామని తెలిపారు.

లోకం పోకడ

ఇక నుంచి ప్రతినెలా స్కూలు ఫీజు, బస్సుఫీజుతోపాటు ట్యాంకర్ ఫీజు కూడా!

గురుశిష్యుల రహస్య భేటీ!

మొదటిపేజీ తరువాయి...

భేటీ కావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఎంతటి గురుశిష్యుల బంధమైనా వైరి రాజకీయ కూటముల్లో (ఎన్డీయే, ఇండియా కూటములు) ఉన్న ఈ ఇద్దరు నేతలు రహస్యంగా కలుసుకోవడంపైనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ఇంతటి కీలక సమయంలో జరిగిన ఈ భేటీకి బీజేపీ పెద్దల ప్రోద్బలం ఉండవచ్చునని పరిశీలకులు భావిస్తున్నారు.

ప్రణాళిక ప్రకారమే భేటీ

ఏపీలో జగన్ సర్కార్‌ను ఏమి చేసైనా కూల్చేయాలని కంకణం కట్టుకున్న చంద్రబాబు ఇప్పటికే పవన్ కల్యాణ్ నేతృత్వంలోని జనసేనతో జతకట్టి బీజేపీతో పొత్తుకు వెంపర్లాడుతున్నారు. ఆ ప్రయత్నంలోనే బీజేపీ ఢిల్లీ పెద్దలతో చర్చించేందుకు ఆయన గురువారం ప్రత్యేక విమానంలో బయల్దేరేందుకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు. అదే సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఎయిర్‌పోర్ట్‌కు వచ్చారు. లోక్‌సభ అభ్యర్థులను ఎంపిక చేయడానికి ముఖ్యమైన నేతలను కాంగ్రెస్ అధిష్ఠానం పిలవడంతో రేవంత్ ఢిల్లీ బయలుదేరారు. రేవంత్‌తోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మరో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కూడా కాంగ్రెస్ అధిష్ఠానం ఆహ్వానం పంపింది. అయితే కేంద్ర మంత్రులతో భేటీ ఉన్నందున భట్టి విక్రమార్క ఉదయమే ఢిల్లీ వెళ్లిపోయారు. ఇక రేవంత్, ఉత్తమ్ కలిసి ఢిల్లీ వెళ్లాల్సి ఉండగా.. రేవంత్ ఒకింత ముందుగానే ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నట్టు తెలిసింది. చంద్రబాబును కలుసుకొనేందుకే ఆయన ముందుగా వచ్చినట్టు భావిస్తున్నారు. గురువారం సాయంత్రం 3.30 గంటల నుంచి 5.30 గంటల వరకు బాబు, రేవంత్ మంతనాలు సాగించినట్టు చెప్తున్నారు. వీరి భేటీకి సంబంధించిన ఫొటోలు మాత్రం బయటకు రాకుండా గట్టి జాగ్రత్తలు తీసుకున్నారు. సాధారణ విమాన ప్రయాణికులు కనీసం గంట ముందు విమానాశ్రయాలకు చేరుకోవాలి. కానీ కేవలం తమ కోసమే ఈ ఇద్దరు నేతలు ప్రత్యేక విమానాలు ఏర్పాటు చేసుకున్నందున వారు ఎప్పుడు కోరుకుంటే అప్పుడే అవి టేకాఫ్ అవుతాయి. అందువల్ల బాబు, రేవంత్‌ల భేటీ యాదృచ్ఛికం కాదు ప్రణాళిక ప్రకారమే జరిగిందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

2 గంటల పాటు చర్చోపచర్చలు

చంద్రబాబు ప్రోద్బలంతోనే ఈ భేటీ జరిగినట్టు తెలుస్తున్నది. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో తనకు మద్దతునివ్వాలని ఆయన తన శిష్యుడు రేవంత్‌ను కోరినట్టు సమాచారం. ఇటీవల తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కాంగ్రెస్‌కు మద్దతునిచ్చిన సంగతి తెలిసిందే. ఆ క్రమంలో టీడీపీ కనీసం తన అభ్యర్థులను పోటీకి కూడా దించలేదు. ఇందుకు ప్రతిఫలంగా తనకు ఏపీ ఎన్నికల్లో సహకారం అందించాలని చంద్రబాబు కోరినట్టు చెప్తున్నారు. టీడీపీ, బీజేపీ మధ్య పొత్తు కుదిరినప్పటికీ తగిన సాయం చేస్తానని రేవంత్ తన గురువుకు వాగ్దానం చేసినట్టు సమాచారం. అయితే అధికారికంగా కాంగ్రెస్ పార్టీ పక్షాన మాత్రం ఎటువంటి మద్దతు ఉండదని చెప్పినట్టు తెలిసింది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో దిగనున్న అభ్యర్థులపైకూడా సమాచారం ఇచ్చిపుచ్చుకున్నట్టు వినికిడి. తెలంగాణలో టీడీపీకి ఎలాగైనా జవసత్వాలు కలిగించాలని భావిస్తున్న చంద్రబాబుకు.. కాంగ్రెస్ పార్టీ నుంచైనా తన శిష్యుడు సీఎం కావడంతో ఒకింత ఆశ పెరిగింది. ఇదే సమయంలో ఏపీలో అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ సరిహద్దుల నుంచి ఎలాంటి సహాయాన్ని కావాలనుకుంటున్నారో చంద్రబాబు తన శిష్యుడితో స్పష్టంగా చర్చించినట్టు తెలుస్తున్నది. టీడీపీకి ఆర్థికంగా సహాయ సహకారాలు అందించే బడాబాబులందరూ.. హైదరాబాద్‌లో వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్నవారే. ఈ నేపథ్యంలో వారి నుంచే ఎన్నికల ఖర్చులకు నగదును తరలించాల్సి ఉంటుంది. ఈ కోణంలోనూ రేవంత్ నుంచి సహాయ సహకారాలు కోరి ఉండవచ్చని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

ఎన్నికల తర్వాత స్పష్టత

తెలంగాణలో పదేండ్లపాటు పాలన సాగించిన బీఆర్ఎస్‌ను ఓడించేందుకు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి కలిసి కృషి చేశారు. వీరికి బీజేపీ కూడా తోడయ్యింది. అధికారానికి వచ్చిన తరువాత రేవంత్‌రెడ్డి పాలన ఒకనాటి చంద్రబాబు ప్రభుత్వాన్ని తలపిస్తున్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకప్పుడు తెలుగుదేశం నాయకులైన ప్రస్తుత మంత్రి సీతక్కతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి.. రేవంత్ ప్రోద్బలంతోనే కాంగ్రెస్‌లో చేరారు. అధికారాన్ని చేపట్టింది మొదలు రేవంత్ అటు పార్టీలో, ఇటు ప్రభుత్వంలో తన వర్గాన్ని క్రమంగా పెంచుకుంటున్నారు. ఇటీవల ప్రధాని మోదీని పెద్దన్న అని సంబోధించడం, బీజేపీ పాలనను అభినందించడం.. మరోవైపు బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మణ్ లోక్‌సభ ఎన్నికల తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందని జోస్యం చెప్పడం.. ఇంకోవైపు చంద్రబాబు బీజేపీతో పొత్తు పెట్టుకోవడం.. ఈ పరిణామాలు ఎటువైపు దారితీస్తాయోనన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.

స్నేహబంధం.. బహిరంగం!

కాంగ్రెస్-బీజేపీ చెట్టాపట్టాల్ • మున్సిపాలిటీల్లో సంయుక్త అవిశ్వాసాలు • కుర్చీలు పంచుకుంటున్న నేతలు

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): 'స్నేహ బంధమూ.. ఎంత మధురమూ..' అని పాడుకుంటున్నాయి కాంగ్రెస్-బీజేపీ. పెద్దసార్లే కలిసిపోగా లేనిది, మనకేమైందంటూ కిందిస్థాయి నేతలు కూడా చేతిలో చెయ్యేసి హాయిగా డ్యూయెట్లు పాడుకుంటూ బీఆర్ఎస్‌ను రాజకీయంగా దెబ్బకొట్టే ప్రయత్నం చేస్తున్నారు. మున్సిపాలిటీల్లో జరుగుతున్న అవిశ్వాసాలే అందుకు అతిపెద్ద ఉదాహరణ. సిద్ధాంతాలు పట్టుకుని వేలాడితే పదవులు వస్తాయా? పాడా? అనుకుంటూ ఒకరికొకరు సహకరించుకుంటూ పదవుల పంపకాల్లో బిజీగా మారారు. అందులో భాగంగా బీఆర్ఎస్ చైర్మన్, వైస్ చైర్మన్లను పదవుల్లోంచి తొలగించేందుకు అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెడుతున్నారు.

అవిశ్వాసాలు ఇలా

- భువనగిరి మున్సిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్‌పై బీజేపీ, కాంగ్రెస్ కౌన్సిలర్లు సంయుక్తంగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి విజయం సాధించారు. ఖాళీ అయిన చైర్మన్ కుర్చీలో కాంగ్రెస్ నాయకుడు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ కుర్చీలో బీజేపీ నాయకుడు మాయ దశరథ్ కూర్చోవడం వారి స్నేహానికి అద్దం పడుతున్నది.
- నల్లగొండ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ చైర్మన్ మందడి సైదిరెడ్డిపై అవిశ్వాస తీర్మానం పెట్టారు. కొత్త చైర్మన్‌గా కాంగ్రెస్‌కు చెందిన బుర్రి శ్రీనివాసరెడ్డికి అనుకూలంగా కాంగ్రెస్ కౌన్సిలర్లతోపాటు ఐదుగురు బీజేపీ కౌన్సిలర్లు కూడా మద్దతు తెలిపారు.
- జగిత్యాల మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా రెబల్ అభ్యర్థిగా బరిలోకి దిగిన అడువాల జ్యోతికి కాంగ్రెస్, బీజేపీ కలిపి మద్దతు పలికాయి.
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాల, నస్పూర్, ఖానాపూర్ మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టగా, ఆయా మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ కౌన్సిలర్లు చైర్మన్, వైస్ చైర్మన్లుగా గెలుపొందారు. నస్పూరులో ఓ బీజేపీ కౌన్సిలర్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.
- ఉమ్మడి మెదక్ జిల్లాలోని నారాయణఖేడ్‌లో అవిశ్వాస తీర్మానం పెట్టి కాంగ్రెస్ కౌన్సిలర్లను చైర్మన్, వైస్ చైర్మన్లుగా ఎన్నుకున్నారు.

ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గం, మున్సిపాలిటీల్లోనూ కాంగ్రెస్, బీజేపీ మధ్య దోస్తీ బలపడుతూ వస్తున్నది. స్థానిక పరిస్థితుల నేపథ్యంలోనే ఇలా జరుగుతున్నదని ఇరు పార్టీల నేతలు చెబుతున్నా, అంతర్గతంగా మాత్రం రెండు జాతీయ పార్టీల మధ్య స్నేహం బలంగా పెనవేసుకుపోయిందని చెప్పుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత కాంగ్రెస్, బీజేపీ మధ్య దోస్తీ మరింత బలపడింది. గతంలో జరిగిన ఉప ఎన్నికల్లో వీటి మధ్య సయోధ్య కనిపించింది. ఇప్పుడు బహిరంగమైపోయింది. మున్సిపాలిటీల్లో అవిశ్వాసాలు, కుర్చీల పంపకాలు అందులో భాగమేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

నలుగురు కాంగ్రెస్ అభ్యర్థులు ఖరారు

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థుల తొలి జాబితాను కాంగ్రెస్ శుక్రవారం ప్రకటించింది. 39 మందితో కూడిన ఈ జాబితాలో 4 తెలంగాణ స్థానాలు ఉన్నాయి. నల్లగొండ నుంచి రఘువీర్‌రెడ్డి (సీనియర్ నేత జానారెడ్డి కుమారుడు), మహబూబ్‌నగర్ నుంచి వంశీచంద్‌రెడ్డి, మహబూబాబాద్ నుంచి కేంద్ర మాజీ మంత్రి బల్‌రామ్ నాయక్, జహీరాబాద్ నుంచి సురేశ్ షెట్కార్ పోటీ చేయనున్నారు. తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాలు ఉండగా.. 13 స్థానాలను కాంగ్రెస్ పెండింగ్‌లో పెట్టింది. వీటిలో ఖమ్మం, మల్కాజిగిరి, నాగర్‌కర్నూల్, మెదక్ వంటి కీలకస్థానాలున్నాయి. ఖమ్మం నుంచి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భార్య నందిని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోదరుడు ప్రసాద్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కుమారుడు యుగంధర్ టికెట్ ఆశిస్తున్నారు. నాగర్‌కర్నూల్ నుంచి మల్లు రవి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ టికెట్ కోసం పోటీపడుతున్నారు. హైదరాబాద్ నుంచి అలీ మస్కతి, చేవెళ్ల నుంచి సునీతా మహేందర్‌రెడ్డి, సికింద్రాబాద్ నుంచి బొంతు రామ్మోహన్, కరీంనగర్ నుంచి ప్రవీణ్‌రెడ్డి, నిజామాబాద్ నుంచి టీ జీవన్‌రెడ్డి, మెదక్ నుంచి నీలం మధు, పెద్దపల్లి నుంచి గడ్డం వంశీ (ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కుమారుడు), వరంగల్ నుంచి దొమ్మాటి సాంబయ్య పేర్లు దాదాపు ఖరారైనట్టు సమాచారం. అయితే పొత్తులో భాగంగా వరంగల్ స్థానం తమకు కేటాయించాలని సీపీఐ గట్టిగా పట్టుబడుతున్నట్టు తెలుస్తున్నది.

నిమిషాల్లో పేర్లు తారుమారు!

తొలుత ఏఐసీసీ లెటర్‌హెడ్‌తో సోషల్‌మీడియాలో సర్క్యులేట్ అయిన జాబితాలో చేవెళ్ల నుంచి సునీతా మహేందర్‌రెడ్డి పోటీ చేయనున్నట్టు ఉన్నది. కానీ అధికారిక ప్రకటనలో మాత్రం ఆమె పేరు లేదు. అలాగే మహబూబ్‌నగర్ నుంచి వంశీచంద్‌రెడ్డి పేరును హోల్డ్‌లో పెట్టినట్టు ఉండగా.. అధికారిక ప్రకటనలో మాత్రం ఆయన పోటీ చేయనున్నట్టు వెల్లడించారు.

'ఐఎంజీ భారత్' తీర్పును స్వాగతిస్తున్నాం

బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి రావుల శ్రీధర్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ)/హైదరాబాద్ సిటీబ్యూరో: ఐఎంజీ భారత్ కంపెనీకి ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి సీఎం చంద్రబాబు ప్రభుత్వం కేటాయించిన భూమిని వెనక్కి తీసుకోవాలని తెలంగాణ హైకోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పును స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి రావుల శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఐఎంజీ భారత్ సంస్థ వేసిన పిటిషన్‌ను రద్దు చేసి 850 ఎకరాల భూమిని తిరిగి ప్రభుత్వానికి అప్పగిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గచ్చిబౌలిలోని సదరు ప్రభుత్వ భూమిని చంద్రబాబు ప్రైవేటు వ్యక్తులకు అప్పనంగా అప్పగించిన వ్యవహారంపై సీబీఐ వంటి ప్రముఖ సంస్థలతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. బాధ్యులెవరూ తప్పించుకోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. హైకోర్టు తీర్పుతో హైదరాబాద్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాలు, మిగతా ప్రభుత్వ ఆస్తులు తిరిగి ప్రభుత్వానికి రావడం హర్షణీయమని పేర్కొన్నారు. ఐఎంజీ భారత్ సంస్థ అధినేత బిల్లీ రావుకు ఎలాంటి క్రీడా నేపథ్యం లేదని, ఆసంస్థకు ఫ్లోరిడాలో ఎలాంటి లింకులు లేవని పేర్కొన్నారు. ఆనాడు ఎకరం ధర రూ.13 లక్షలు ఉంటే రూ.25 వేల నుంచి రూ.50 వేలకే 400 ఎకరాలు కంపెనీకి కేటాయించి రిజిస్ట్రేషన్ కూడా చేశారని వివరించారు. అనంతరం వైఎస్సార్ ప్రభుత్వం ఆ ఒప్పందాన్ని రద్దు చేయగా ఐఎంజీ భారత్ కంపెనీ కోర్టును ఆశ్రయించిందని తెలిపారు. 21 ఏండ్ల తర్వాత ఈ తీర్పు ఇవ్వడం ముదావహమని శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు.

బీజేపీతో టీడీపీ పొత్తు

ఆరేండ్ల తరువాత జతకట్టిన బాబు

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): ఏపీ రాజకీయాలు మరో కీలక మలుపు తీసుకుంటున్నాయి. దాదాపు ఆరేండ్ల తరువాత టీడీపీ అధినేత చంద్రబాబు బీజేపీతో ఎన్నికల పొత్తు కుదుర్చుకున్నారు. ఏపీలో త్వరలో జరుగనున్న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కలిసి పనిచేయాలని నిర్ణయించామని తెలుగుదేశం పార్టీ ఏపీ అధ్యక్షుడు కే అచ్చెన్నాయుడు శుక్రవారం వెల్లడించారు. ఈ మేరకు ఢిల్లీలో మూడు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చర్చలు జరిపారు. పొత్తుల్లో ఆ పార్టీలు అవగాహనకు వచ్చాయి. బీజేపీ, జనసేన పార్టీలకు 30 అసెంబ్లీ, 8 లోక్‌సభ స్థానాలు ఇచ్చేందుకు టీడీపీ అంగీకరించింది. మిగతాచోట్ల టీడీపీ పోటీ చేసేలా అంగీకారం కుదిరినట్టు సమాచారం. బీజేపీ ఐదు, జనసేన మూడు సీట్ల లో పోటీ చేయనున్నట్టు తెలిసింది. అరకు, రాజమండ్రి, నరసాపురం, తిరుపతి, రాజంపేట స్థానాల్లో బీజేపీ.. అనకాపల్లి, కాకినాడ, మచిలీపట్నం సీట్లలో జనసేన పోటీచేయనున్నట్టు సమాచారం.

పండుగపూట నీళ్ల కోసం రోడ్డెక్కిన మహిళలు

మంచినీళ్ల కోసం జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని సీతారాంపురం గ్రామస్థులు శుక్రవారం ఖాళీబిందెలతో రోడ్డెక్కారు. రెండు నెలలుగా తాగునీరు రావడం లేదని దళిత మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పైపులైన్ల నుంచి, ట్యాంకర్ల ద్వారా వచ్చే అరకొర నీళ్లు దేనికీ సరిపోవడం లేదని వారు ఆందోళన చెందారు. – గణపురం

వరి పంటకు ట్యాంకర్ నీరే దిక్కు

రాయపర్తి, మార్చి 8 : పంటలను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఎండలు ముదిరి, భూగర్భ జలాలు అడుగంటినా ప్రభుత్వం సాగునీటిని అందించకపోవడంతో వీటికి తోడు అడపాదడపా కరెంట్ కోతలతో పొట్ట దశలో ఉన్న పంటను కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం తిర్మలాయపల్లి శివారులోని సపావత్ తండాకు చెందిన భూక్యా భోజ్యా తాను సాగు చేసిన వరి పంటకు ట్యాంకర్‌తో నీళ్లు పారిస్తున్న దృశ్యాలు అన్నదాతల ఇబ్బందులకు అద్దం పడుతున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి సాగునీటిని అందించాలని రైతులు కోరుతున్నారు.

వరి పంటకు ట్యాంకర్‌తో నీళ్లు పడుతున్న రైతు

కరెంటు కాటుకు మరో రైతు మృతి

ముస్తాబాద్, మార్చి 8: ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫ్యూజ్ వైర్ వేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతిచెందాడు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం కొండాపూర్‌లో చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిగురు యాదగిరి (55) వరి పంట వేశాడు. నీళ్లు పెట్టేందుకు శుక్రవారం సాయంత్రం 6 గంటలకు పొలం వద్దకు వెళ్లాడు. బోర్ ఆన్ చేయగా నీళ్లు రాలేదు. అయితే ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ వైర్ పోయినట్టు గుర్తించాడు. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ హ్యాండిల్‌తో ఏ-బీ స్విచ్ ఆఫ్ చేశాడు. అయితే విద్యుత్తు సరఫరా చేసే మూడు పత్తుల్లో రెండు లైన్ నుంచి విడిపోగా, ఒకటి అలాగే ఉండిపోయింది. యాదగిరి దీన్ని గమనించకుండానే మరమ్మతు చేస్తుండగా ఒక్కసారిగా షాక్ కొట్టడంతో కిందపడిపోయాడు. సమీపంలోని రైతులు గమనించి ముస్తాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి సిరిసిల్లకు తరలించగా, చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. యాదగిరికి భార్య లక్ష్మి, ఇద్దరు కొడుకులు, ఇద్దరు బిడ్డలు ఉన్నారు.

కరెంట్ సక్కగరాక.. కాలిపోతున్నయ్!

మొదటిపేజీ తరువాయి...

వేస్తామన్నది. ఉన్నదే దిక్కులేదు' అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం బుగ్గ రాజేశ్వరస్వామి దేవాలయాన్ని దర్శించుకొని వస్తున్న క్రమంలో నారాయణరావుపేట లోని మోటర్ వైండింగ్ షాపులో పలువురు రైతులు ఉండటాన్ని గమనించిన ఆయన.. వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు కాంగ్రెస్ పాలనలో మోటార్లు కాలిపోతున్నాయని, లోఓల్టేజీ సమస్యతో కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియడం లేదని గోడు వెళ్లబోసుకున్నారు. ఒకవైపు రైతుబంధు అందలేదని, మరోవైపు మోటర్ల రిపేర్ కోసం ఉన్న పైసలన్నీ ఖర్చు అయితున్నదని వెల్లడించారు. నీళ్లు అందక పంటలు ఎండిపోతున్నాయని తమ కష్టాలను వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాలిపోయిన మోటర్ల రిపేర్ కోసం వచ్చే వారి సంఖ్య పెరిగిందని ఆ మోటర్ వైండింగ్ షాపు యజమాని హరీశ్‌రావుతో తెలిపారు.

కేసీఆర్‌పై కక్ష.. రైతులకు శిక్ష

బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్‌పై కక్షతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచిత చర్యలకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నదని హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేటలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, కట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని పలు ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ఎండాకాలంల